TGTEL/26/A6221




తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365


# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 31 | గురువారం | 27-ఆగస్టు -2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:31 | Thursday | 27-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/- |

## నేపాల్‌లో భూకంపం..
# వరద విలయం..

- నేపాల్‌ను ముంచెత్తిన ప్రకృతి విపత్తు
- మెరుపు వరదల్లో 157 మందికిపైగా జలసమాధి!
- 750 మందికిపైగా పర్యాటకుల జాడ గల్లంతు
- భూకంపం ధాటికి విరిగిపడిన కొండచరియలు
- ఉగ్రరూపం దాల్చి లోతట్టు ప్రాంతాలను ముంచేసిన నది
- ఇళ్లు, వంతెనలు, ప్రాజెక్టులు, రోడ్లు సర్వనాశనం

కర్మాండు: ప్రకృతి ప్రకోపం ధాటికి నేపాల్ చివురుటాకులా వణికిపోయింది. రాజధాని కర్మాండు సమీపంలోని రాసువా, దాడింగ్ జిల్లాల ఎగువ ప్రాంతంలో బుధవారం ఉదయం సంభవించిన భూకంపం తర్వాత పెను ఉపద్రవాన్ని మోసుకొచ్చింది. ఉదయం 8.37 గంటలకు టిబెట్ సరిహద్దు ప్రాంతంలో కొడారీ అనే చోట భూమికి 77 కిలోమీటర్ల లోతులో రిక్టర్ స్కేల్‌పై 4.4 తీవ్రతతో సంభవించిన భూకంపం ధాటికి హిమాలయ

2లో

## డిప్యూటీ సీఎం, ఉత్తమ్‌తో కొండా మురళి భేటీ..

- కుమార్తె వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న సమావేశం
- మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ సంఘం సిఫార్సు చేసినట్లు ప్రచారం
- పార్టీ మారేది లేదన్న కొండా మురళి
- గాంధీ కుటుంబంపై పూర్తి విశ్వాసం ఉందని వెల్లడి



2లో

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు

# ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'.

- జనవరి 1 నుంచి ఏపీలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు
- కుప్పం, చిత్తూరులో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- ఏఐ, డిజిటల్ హెల్త్ రికార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- ప్రజల ఆరోగ్య సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత
- కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం



ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని,

- మిగతా 2వ పేజీలో



## బొగ్గు దాటి బంగారం, రాగిపై సింగరేణి ఫోకస్..

- దేవదుర్గ ఖనిజ బ్లాక్‌పై ప్రత్యేక దృష్టి
- అన్ని కీలక ఖనిజ వేలాల్లో పాల్గొనాలి
- వనాడియం, టైటానియంపై ముందస్తు ప్లాన్
- కాపర్, లిథియం, కోబాల్ట్‌పైనా ఫోకస్

కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ

## ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్
- ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు లోకేశ్ జవాబులు
- కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి




వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది.

- మిగతా 2వ పేజీలో



## ఆరుగురు దుర్మరణం

- 15 మందికి తీవ్ర గాయాలు
- ప్రమాదానికి గురైన ట్రాలీ లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో దుర్ఘటన
- మృతులందరిదీ ఉమ్మడి కృష్ణా జిల్లా
- మృతులలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు
- వారిలో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

కోదాడ, కోదాడ రూరల్/సాక్షిప్రతినిధి, విజయవాడ: హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి మరోసారి రక్తసిక్తమైంది. బుధవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాుదం జరిగింది. ప్రమాదానికి గురై సగం రోడ్డుమీద,

- మిగతా 2వ పేజీలో

## 34% రిజర్వేషన్లు.. మహా డ్రామా

- చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అయినా రిజర్వేషన్లకు మించి బీసీలను ఓపెన్ కేటగిరీలో ప్రమోట్ చేశాం
- వారికి అత్యధికంగా లబ్ధి జరిగింది జగన్ హయాంలోనే
- 4 రాజ్యసభ, ఇద్దరు డిప్యూటీ సీఎంలు, మంత్రుల్లో 40% బీసీలకే ఇచ్చాం
- 2014--19 మధ్య బాబు బీసీలకు ఒక్క రాజ్యసభ సీటూ ఇవ్వలేదు
- బీసీ జనగణన జరగాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం
- బీసీలకు 50% సీట్లు కల్పించాలంటూ పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టాం
- బీసీలపై ప్రేమ ఉంటే చంద్రబాబు నాయుడు ఇవన్నీ చేస్తాడా?
- ఇప్పుడు బీసీల రిజర్వేషన్లు అంటూ మహా డ్రామాకు తెరలేపాడు

రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీల తల రాతలను మార్చే విప్లవాత్మక సంస్కరణలు మా ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో తీసుకు వచ్చాం. కోర్టులు కొట్టేసినా, బీసీలకు ఆ మేరకు రాజకీయంగా ప్రోత్సాహం ఇవ్వాలని మాకు మేముగా నిర్ణయం తీసుకున్నాం. 34 శాతమే కాదు, అంతకంటే ఎక్కువ పదవులు ఇచ్చి, మా చిత్తశుద్ధిని చాటుకున్నాం.

-వైఎస్ జగన్



2లో

# ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు. అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు.

## ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'.

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

## ఆరుగురు దుర్మరణం

సగం డివైడర్‌పై ఆగిుపోయిన ట్రాలీ లారీని గమనించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్‌డ్రైవర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (టీఎస్ 08యుఎల్ 5112) 42 మంది ప్రయాణికులతో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి ఏలూరుకు బయలుదేరింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో సూర్యాపేట సమీపంలోని చార్జింగ్ స్టేషన్ వద్ద ఆపి బస్సు చార్జింగ్ పెట్టుకున్నారు. ఈ సమయంలో మొదటి డ్రైవర్ డ్యూటీ దిగి రెండో డ్రైవర్‌కు బస్సు అప్పగించాడు. హైదురాబాద్ నుంచి విజయువాడవైపు ఐరన్ పిల్లర్లలోడ్‌తో వెళ్తున్న ట్రాలీ లారీ బుధువారం తెల్లవారుజామున 4 గంటలకు కోదాడ శివారులో అదుపుతప్పి డివైడర్‌పైకి సగం వెళ్లి ఆగింది. ఆ తర్వాత 48 నిమిషాలకు కోదాడ శివారుకు చేరుకున్న బస్సు డ్రైవర్ ట్రాలీ లారీని గమనించకుండా వెనుకువైపు నుంచి వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాలీ లారీలో ఉన్న ఐరన్ పిల్లర్లు బస్సులోకి చొచ్చుకురావడంతో బస్సు కుడివైపు భాగం పూర్తిగా దెబ్బతిని డ్రైవర్ సీటు వెనుక సీట్లులో ఉన్న యాసారపు చిన్ని(32), బొల్లిపోగు మేరీ జ్యోత్స్న (29), సూరవరపు షకీనా(24), చెన్నకేశువుల నాగేంద్రబాబు(31), పడికిటి లక్ష్మీతేజ (30), కొండూరు భావన వర్ష(23) అక్కడిక్కడే మృతిచెందారు. మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కోదాడ రూరల్ ఇన్‌చార్జ్ సీఐ రామకృష్ణారెడ్డి, పలువురు ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోదాడ దాటిన తరువాత కిలోమీటరు దూరంలో ఇనుప పిల్లర్ల లోడ్‌తో వెళుతున్న ట్రాలీ లారీ బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో ప్రమాదానికి గురై డివైడర్‌మీదకు దూసుకెళ్లింది. సగం టైర్లు రోడ్డుమీద, సగంటైర్లు డివైడర్‌పై ఉన్నాయి. లారీ డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక బోర్డులూ పెట్టకపోవడంతో ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదం జరగడానికి అరగంట ముందే మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్ కూడా ట్రాలీ లారీని ఢీకొట్టబోయి తృటిలో తప్పించుకుంది. ఆ బస్సుకు స్వల్పంగా గీతలు పడ్డాయి. ఆ బస్సు డ్రైవర్ తన బస్సును పక్కకు ఆపి ట్రాలీ లారీ వద్దకు వచ్చి డ్రైవర్‌ను తీవ్రంగా హెచ్చరించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వెంటనే హెచ్చరిక బోర్డులు పెట్టాలని గట్టిగా చెప్పి వెళ్లిపోయినట్టు సమాచారం. ఆ బస్సు వెళ్లిన 15 నిమిషాల్లోనే ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బస్సులో ఇరుక్కుపోయిన మృతదేహాలను పోలీసులు అతికష్టంమీద వెలికితీశారు. కోదాడ వైద్యశాలకు తరలించారు. పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతి చెందిన ఆరుగురిది ఉమ్మడి కృష్ణా జిల్లా. వీరిలో యాసరపు చిన్ని, భావనవర్ష, షకీనా మినహా మిగిలిన ముగ్గురూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. షకీనా కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటుర్వ్యూకు వెళ్లి తిరిగి వస్తూ మృత్యుఒడికి చేరారు.

# నేపాల్‌లో భూకంపం.. వరద విలయం..

పర్వతప్రాంతంలోని కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ కొండల మీది గ్లేసియర్(హిమానీనదాలు)లోని భారీ స్థాయిలో మంచు ఒక్కసారిగా దిగువన ఉన్న భోటె కోశీ నదిలో పడింది. దీంతో మంచు కరిగి అనూహ్య రీతిలో నదీ ప్రవాహం, నీటి మట్టం పెరిగాయి. దీంతో మెరుపు వరదలు సంభవించి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. నది ఉగ్రరూపం దాల్చి దిగువన ఉన్న రాసువా, ధాడింగ్ జిల్లాల్లో నదీ పరీవాహక ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు, డజను జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, దుకాణ సముదాయాలను సర్వనాశనం చేసింది. 42 కి.మీ.ల పొడవైన కీలక బేత్రావతి--రసువాగఢి రోడ్డు కొట్టుకుపోయింది. నేపాల్ పర్వతప్రాంత రమణీయతను చూసేందుకు దేశవిదేశాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఈ మెరుపు వరదల్లో జలసమాధి అయ్యారు. 157 మందికిపైగా చనిపోయారని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 750 మందికిపైగా పర్యాటకులు, స్థానికుల జాడ గల్లంతైంది. జాడ తెలీకుండా పోయిన వారిలో 133 మంది భారతీయులు, 37 మంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు టూరిస్ట్ కంపెనీలు, స్థానిక యంత్రాంగం గణాంకాలను బట్టి తెలుస్తోంది. నువాకోట్, ఛిటావన్ జిల్లాల్లోనూ మెరుపు వరదల భీభత్సం ఎక్కువగాఉంది. వరద ఉధృతికి సమీపంలోని ఇళ్లు, హోటళ్లు, ఇతర నిర్మాణాలు పేకమేడల్లా కూలాయి. కార్లు, ఇతర వాహనాలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అసలేం జరుగుతుందో తెలిసేలోపే అమాంతం వరద ముంచెత్తి జనం జలసమాధి అయిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నేపాల్--చైనా సరిహద్దులోని రసువాగఢి చెక్‌పోస్ట్‌లో రెండంతస్తుల భవంతిని వరదనీరు రెప్పపాటులో సర్వనాశనం చేసిన వీడియో సోషల్‌మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. వరదధాటికి ఇక్కడ నేపాల్--చైనా భూతల మార్గం పూర్తిగా ధ్వంసమైంది. వరద ఉధృతికి నామరూపాలు కోల్పోయి, బురదలో కూరుకుపోయి ఆ ప్రాంతాలన్నీ భీతావహంగా మారాయి. ఎటు చూసినా అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద, సాయం కోసం అరి?థస్తున్న జనం హాహాకారాలతో ఆ ప్రాంతాల్లో విషాద వాతావరణం రాజ్యమేలుతోంది. భోటె కోశీ నదీజలాలు తర్వాత తిబూరే ప్రాంతంలో త్రిశూలి నదిలోకి రావడంతో దాని కారణంగానూ ఒకింత విధ్వంసం పెరిగింది. బుధవారం రాత్రినాటికి ఏడు జిల్లాల్లో 95 మృతదేహాలను స్వాదీనం చేసుకున్నారు. నేపాల్ వరద నీటితో గండక్ నదిలో నీటి మట్టం పెరిగే ఆస్కారం ఉండటంతో బిహార్, ఉత్తర ప్రదేశ్‌లో స్థానికయంత్రాంగాలు నదీపరీవాహక ప్రాంతాలోని ప్రజలను అప్రమత్తంచేశాయి. దిగువ ప్రాంతాల నుంచి ఎగువ ప్రాంతాలకు తరలిపోవాలని అధికారులు సూచించారు. అవసరమైతే తగు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా భరోసా ఇచ్చారు. గండక్ నదిపై ఒక బరాజ్‌లో 36 గేట్లను ఎత్తి నీళ్లను కిందకు వదిలేస్తున్నారు. వరదనీటి ముప్పు ఉండే ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సహాయక బృందాలకు యూపీ సీఎం యోగి సూచించారు. తమ అధీనంలోని టిబెట్‌లోని సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ వరద విలయం ఎక్కువగా ఉండటంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ విస్తృతస్థాయిలో అన్వేషణ, సహాయక చర్యలు చేపట్టాలని ఆర్మీకి ఆదేశాలిచ్చారు. అమెరికా, మలేసియా, బ్రిటన్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, దక్షిణకొరియా పర్యాటకుల జాడ తెలీడంలేదని నేపాల్ టూరిజం బోర్డ్ తెలిపింది. టిబెట్‌లోని కైలాస్ మానస సరోవర్‌ను దర్శించుకునేందుకు యాత్రకు వచ్చిన 77 మంది భారతీయుల జాడ సైతం తెలీడంలేదని సామ్రాట్ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీ వెల్లడించింది. దీంతో భారతీయుల జాడ కనిపెట్టి ఎలాగైనా క్షేమంతా స్వదేశానికి తీసుకొచ్చేందుకు మోదీ సర్కార్ నడుం బిగించింది.



## 34% రిజర్వేషన్లు.. మహా డ్రామా

అమరావతి: 'బీసీల అభ్యున్నతి విషయంలో ఛాంపియన్ ఎవరైనా ఉన్నారంటే.. అది కేవలం ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వారి తల రాతలను మార్చే విప్లవాత్మక సంస్కరణలు వైఎస్ జగన్ ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చాడు. కోర్టులు కొట్టేసినా, బీసీలకు ఆ మేరకు రాజకీయంగా ప్రోత్సాహం ఇవ్వాలని మాకు మేముగా నిర్ణయం తీసుకుని, 34 శాతమే కాదు.. అంతకంటే ఎక్కువ పదువులు ఇచ్చి, మా చిత్తశుద్ధిని చాటుకున్నాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు బీసీల బతుకులను బుగ్గిపాలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని తెలిసి, ఇదే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టేసిందని తెలిసి కూడా బీసీ రిజర్వేషన్లు పేరిట మరోసారి చంద్రబాబు మహా డ్రామాకు దిగాడని విమర్శించారు. మళ్లీ కోర్టుకు పోయి అడ్డుకోవద్దంటూ కపట నాటకాలు ఆడుతున్నాడని.. కోర్టుకు పోయేది ఆయనే, కొట్టి వేయించేదీ ఆయనే, మళ్లీ దొంగ ఏడుపులు ఏడ్చేదీ ఆయనేనంటూ ధ్వజమెత్తారు. ప్రస్తుతం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలను ఆపేయడంతో పాటు సూపర్ సిక్స్, సూపర్‌సెవెన్ హామీలను చెత్త బుట్టలో వేసి బీసీల బతుకులను బుగ్గిపాలు చేస్తున్నాడని మండిపడ్డారు. రాజకీయంగా బీసీల ఎదుగుదలను ఓర్చుకోలేక, వారి మీద అక్రమ కేసులు పెట్టి, జైల్లో పెట్టే కార్యక్రమం చేస్తున్న చంద్రబాబుకు బీసీల మీద ప్రేమ ఉందంటే ఎవరైనా నమ్ముతారా? అంటూ విమర్శించారు. '2019లో మేం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నంబర్ 176 ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చి, ఎన్నికలకు సిద్ధం అయ్యాం. కానీ చంద్రబాబు తన పార్టీ నాయకుడు, తన ప్రభుత్వంలో ఏపీ స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న బిర్రు ప్రతాపరెడ్డి ద్వారా హైకోర్టులో, సుప్రీంకోర్టులో కేసు వేయించాడు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నందుకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొట్టేస్తున్నామని హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని తెలిసి, ఇదే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టేసిందని తెలిసి కూడా చంద్రబాబు మరోసారి మహా డ్రామాకు దిగాడు. పైగా మళ్లీ కోర్టుకు పోయి అడ్డుకోవద్దంటూ కపట నాటకాలు ఆడుతున్నాడు. కోర్టుకు పోయేది ఆయనే, కొట్టివేయించేదీ ఆయనే, మళ్లీ దొంగ ఏడుపులు ఏడ్చేదీ ఆయనే. బీసీల అభ్యున్నతి విషయంలో ఛాంపియన్ ఎవరైనా ఉన్నారంటే.. అది కేవలం వైఎస్సార్‌సీపీ మాత్రమే. విధ డీబీటీ పథకాల ద్వారా బీసీల ఖాతాల్లోకి నేరుగా రూ.1.30 లక్షల కోట్లు పంపించాం. నాన్ డీబీటీతో కలిపి కేవలం బీసీలకే రూ.1.82 లక్షల కోట్లు అందించాం.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## డిప్యూటీ సీఎం, ఉత్తమ్‌తో కొండా మురళి భేటీ..

తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వారి కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. మంత్రి సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ క్రమశిక్షణ సంఘం నివేదిక సమర్పించినట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ కలయిక చర్చనీయాంశంగా మారింది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ.. ఈ భేటీలో ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదని, ఒక బిల్లు క్లియరెన్స్ విషయంలో మాత్రమే డిప్యూటీ సీఎంను కలిశానని స్పష్టం చేశారు. క్రమశిక్షణ సంఘం తుది నిర్ణయం వెలువడే వరకు తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని ఆయన తెలిపారు. తన కుమార్తెకు తన అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందని, ఆమె చేసిన వ్యాఖ్యలతో తమకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

# బొగ్గు దాటి బంగారం, రాగిపై సింగరేణి ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని తీసుకుంటామని ఆయన చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన చెప్పారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి ఇకపై బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దదేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణ వేగవంతానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు దేవదుర్గ బ్లాక్‌ను ఒక కీలక అవకాశంగా మలచాలని అధికారులకు సూచించారు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. సింగరేణి ఇకపై కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల మైనింగ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని పేర్కొన్నారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు.

గురువారం
27-08-2026
జనరల్ న్యూస్
తొలివెలుగు




# గుడిపల్లి శ్రీనివాస్‌రెడ్డికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

- అందజేసిన ఎమ్మెల్సీ ఏబీఎన్ రెడ్డి
- నిడమనూరు పీఎం మోడల్ స్కూల్‌లో హర్షాతిరేకాలు

**నిడమనూరు, :** నిడమనూరు పీఎం మోడల్ స్కూల్ అర్థశాస్త్ర అధ్యాపకులు గుడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. 'తపస్' ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో బుధవారం నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ ఏబీఎన్ రెడ్డి చేతుల మీదుగా, తపస్ నాయకులు, బుసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ బుసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు భాస్కర్ యోగి సమక్షంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ బోధనా రంగంలో అంకితభావంతో సేవలు అందించినందుకు ఈ గౌరవం దక్కింది. నిడమనూరు ప్రాంతానికి ఈ అవార్డు గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం పీఎం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బురుగు నిర్మల, ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

# పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు సీపీఎం పాదయాత్ర

- ఈనెల 29 నుంచి 31 వరకు నిర్వహణ: దాసరి పాండు
- ఆత్మకూరు(ఎం)లో గోడపత్రికల ఆవిష్కరణ



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు తెలిపారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బుధవారం పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆత్మకూరు మండలంలో ఏళ్ల తరబడి పునాదిగాని కాలువ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసినప్పుడల్లా ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించి పనుల్లో జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి కాలువ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను కూడా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీనియర్ నాయకుడు రచ్చ గోవర్ధన్, మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మల్లెల శ్రీశైలం, వెంకటరెడ్డి, నరసింహ, కేశవులు, సత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరందించడంలో కాంగ్రెస్ విఫలం

- గంధమల్ల రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించాలి
- డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట :** డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా రాజాపేట మండలానికి సాగునీరు అందించే పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని, గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభించి స్థానిక ఎమ్మెల్యే తన హామీని నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజాపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, పాలనలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సునీత విమర్శించారు. భూగర్భజలాలు అడుగంటి సేద్యం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. 3 నెలల్లో సాగునీరందిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఆలేరు ఐలయ్య 30 నెలలు దాటినా నీటి సమస్యను పరిష్కరించలేకపోయారని ఆరోపించారు. గంధమల్ల రిజర్వాయర్ కోసం సేకరించాల్సిన 1,144 ఎకరాల్లో మిగిలిన భూసేకరణను పూర్తి చేసి రైతులకు రూ.87 కోట్ల పరిహారం అందజేయాలని కోరారు. 12 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణానికి అవసరమైన 170 ఎకరాల భూసేకరణను కూడా పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. సాగునీటి సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజాపేట మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మదర్ డైరీ డైరెక్టర్, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్, జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామిండ్ల నరేందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుంటి కృష్ణ, రెడ్డబోయిన రాజు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







# రియల్ వ్యాపారుల కోరల్లో మల్లాయి చెరువు..?

- నామరూపాలు లేకుండా చేసేందుకు యత్నాలంటూ రైతులు, గ్రామస్తుల ఆందోళన
- చెరువు శిఖం, కట్ట తొలగిస్తున్నారన్న ఆరోపణలు
- జేసీబీ పనులను అడ్డుకున్న స్థానికులు.. పంచాయతీకి ఫిర్యాదు
- గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదుకు సిద్ధం
- కబ్జా చేస్తే ఊరుకోం: సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య గౌడ్



**తొలివెలుగు, రాజాపేట :** ఒకప్పుడు పరిసర ప్రాంతాల పంట పొలాలకు జీవనాడిగా నిలిచిన మల్లాయి చెరువు ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోరల్లో చిక్కుకుపోయిందా..? చెరువు శిఖం భూములను తొలగిస్తూ, కట్టను ధ్వంసం చేస్తూ చేపడుతున్న పనులు చెరువు ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయా..? అన్న అనుమానాలు రైతులు, గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని మల్లాయి చెరువు సమీపంలో జేసీబీలతో చేపడుతున్న పనులను స్థానికులు అడ్డుకోవడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. చెరువు సమీపంలోని పట్టా భూమిని కొనుగోలు చేసిన కొందరు రియల్ వ్యాపారులు అభివృద్ధి పనుల పేరుతో భారీ యంత్రాలను వినియోగించి భూమిని చదును చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ పనులు పట్టా భూములకే పరిమితం కాకుండా చెరువు శిఖం పరిధిలోకి విస్తరిస్తున్నాయని, చెరువు కట్టకు కూడా నష్టం వాటిల్లుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సర్వే నంబర్లు 223, 224లో చెరువు..:**

గ్రామస్తులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 223, 224లో మల్లాయి చెరువు విస్తరించి ఉంది. చెరువు సమీపంలోని పట్టా భూములను కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు జేసీబీలతో పనులు చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో చెరువు శిఖం వైపు కూడా పనులు విస్తరిస్తున్నాయని ఆరోపించారు. సుమారు రెండు ఎకరాల మేర చెరువు శిఖం భూమిని తొలగించడంతో పాటు చెరువు కట్టను కూడా దెబ్బతీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**నామరూపాలు లేకుండా పోతుందా..?**

చెరువు శిఖం, కట్టలను తొలగిస్తే మల్లాయి చెరువు తన ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా వర్షపు నీటిని నిల్వ చేసుకుంటూ పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాల పెంపునకు ఈ చెరువు దోహదపడుతోందని తెలిపారు. చెరువు కారణంగానే పరిసర వ్యవసాయ బావులు, బోర్లలో నీటి నిల్వలు పెరిగి సాగుకు ఉపయోగపడుతున్నాయని రైతులు పేర్కొన్నారు. అలాంటి చెరువును కాపాడాల్సిన సమయంలో అభివృద్ధి పనుల పేరుతో శిఖం, కట్టలను తొలగించడం వల్ల వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**జేసీబీ పనులకు అడ్డుకట్ట:**

విషయం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ పనులను అడ్డుకున్నారు. చెరువు భూమిలోకి ప్రవేశించి పనులు చేపట్టవద్దని, చెరువు కట్టను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మల్లాయి చెరువు గ్రామానికి, వ్యవసాయానికి కీలక వనరుగా ఉందని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాలకు గురి కానివ్వబోమని స్థానికులు హెచ్చరించారు.

**గ్రామసభలోనే ఫిర్యాదు..:**

సుమారు 25 రోజుల క్రితం జరిగిన గ్రామసభలోనే ఈ అంశాన్ని రైతులు, గ్రామస్తులు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జేసీబీలతో పనులు జరుగుతుండటంతో మరోసారి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు సర్వే నంబర్లు, హద్దులు, శిఖం ప్రాంతాన్ని అధికారులు పరిశీలించి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తాం:**

మల్లాయి చెరువు పరిరక్షణ కోసం జిల్లా అధికారులను కూడా ఆశ్రయించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చెరువు కట్ట, శిఖం భూముల్లో అక్రమంగా పనులు జరుగుతున్నాయా..? పట్టా భూముల హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయి..? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## కబ్జా చేస్తే ఊరుకోం: సర్పంచ్

మల్లాయి చెరువు ఆక్రమణకు గురవుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై చల్లూరు సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య గౌడ్ స్పందించారు. మల్లాయి చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై తొలివెలుగు ప్రతినిధి వివరణ కోరగా చెరువుకు సంబంధించిన నక్షా వివరాలను అందజేశారు. చెరువు హద్దులు, సంబంధిత భూముల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. సంబంధిత రిజిస్టర్ డాక్యుమెంట్లను తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, చెరువు శిఖం లేదా కట్టకు నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువు కబ్జాకు ఎవరు పాల్పడినా ఊరుకునేది లేదని, మల్లాయి చెరువు పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వబోమని సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య గౌడ్ హెచ్చరించారు. మల్లాయి చెరువు రియల్ వ్యాపారుల కబంధ హస్తాల్లో కనుమరుగవడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రైతులు, గ్రామస్తులు స్పష్టం చేశారు. చెరువును పరిరక్షించేందుకు అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

- బంటుగూడెంలో గొల్లెన ఎల్లయ్య కుటుంబానికి రూ.5 వేలు అందజేత
- పరామర్శించిన సర్పంచ్ కోయ మధు
- హాజరైన భాజపా జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల పరిధిలోని బంటుగూడెం కాలనీకి చెందిన గొల్లెన ఎల్లయ్య ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబానికి రాజాపేట గ్రామ సర్పంచ్ కోయ మధు బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, నాయకులు సట్టు నాని, ప్రసాద్, పాండవుల భిక్షపతి, గొల్లెన స్వామి, నరేష్, చిన్న నర్సయ్య, రవి, సోములు, నాగరాజు, రామయ్య, శేఖర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పోచమ్మ, మహాంకాళి అమ్మవార్ల ప్రతిష్ఠాపన మహోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- హాజరైన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామి

**తొలివెలుగు, నాగోల్ :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నాగోల్ డివిజన్ పరిధిలో శ్రీశ్రీ మహాంకాళి, శ్రీశ్రీ పోచమ్మ అమ్మవార్ల దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు సమర్పించారు. శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి దివ్య ఆశీస్సులు, పర్యవేక్షణలో ఈ వేడుకలు సాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగోల్ ప్రాంతంతో పాటు తెలంగాణ రాష్ట్రప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెరుకు చిరంజీవి గౌడ్, ఉపాధ్యక్షులు అనంతుల రాజిరెడ్డి, కోశాధికారి కోలన్ చంద్రశేఖర్ ఆజాద్, సంయుక్త కార్యదర్శి వస్పరి మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



# ఎంఆర్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక

- చిన్నగూడూరులో ఏకగ్రీవంగా కమిటీ ఎంపిక
- నూతన కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయాలి: ఏక్ శంకర్

**తొలివెలుగు, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) నూతన మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు చాగంటి రమేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా కో-ఇన్చార్జి ఏక్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏక్ శంకర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న నిర్వహించ తలపెట్టిన నూతన మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంఆర్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో నూతన కమిటీలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. సమావేశంలో చిన్నగూడూరు మండల ఎంఆర్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తుడుం ప్రభాకర్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా కంచనపల్లి ప్రశాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా చాగంటి ప్రవీణ్ మాదిగ, కార్యదర్శిగా మెట్టు ప్రశాంత్ మాదిగ, కోశాధికారిగా కంచనపల్లి ఉప్పలయ్య మాదిగ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు నాయకులు అభినందించారు. మండలంలో సంస్థను మరింత బలోపేతం చేసి, మాదిగల హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ఎంఆర్పీఎస్ మాజీ అధ్యక్షుడు చాగంటి రమేష్ మాదిగ, వివిధ గ్రామాల మాదిగలు, యువకులు, ఎంఆర్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- సెప్టెంబర్ 9న వరంగల్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలి
- రాజాపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీల ఎన్నిక



**తొలివెలుగు, రాజాపేట :** సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్ఛార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. రాజాపేట మండల కేంద్రంలో బుధవారం మండల ఇన్ఛార్జి ఎర్రగుంట ప్రభాకర్ మాదిగ, కో-ఇన్ఛార్జి రాంగోల్ల శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాదిగ మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ నూతన మండల కమిటీల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సామాజిక సమానత్వ సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలేరు నియోజకవర్గ ఇన్ఛార్జి నల్ల చంద్రస్వామి మాదిగ, జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం భవిష్యత్తులో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కోయ బాలరాజు మాదిగ, అధికార ప్రతినిధిగా బొడ్డు సురేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా గ్యార యాదగిరి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సిరిపంగ మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ఇంజ బాలరాజు మాదిగ, అధికార ప్రతినిధిగా బడే ఎల్లయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కలకుంట్ల కొమురయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా ఎర్ర పరశురాములు మాదిగ, కార్యదర్శిగా చల్లూరి స్వామి మాదిగ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పెద్దోళ్ల ప్రభాకర్ మాదిగను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులు ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని నాయకులు సూచించారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ సదస్సుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి


- ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలి
- జయ్యారం జీపీ కార్యదర్శి బోడ మంగీలాల్



**తొలివెలుగు, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల పరిధిలోని జయ్యారం, మంగోరిగూడెం, గుండంరాజుపల్లి గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జయ్యారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బోడ మంగీలాల్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా అర్హులైన ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లలో తప్పులు ఉన్నా, మార్పులు చేర్పులు చేయాలన్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి సరిచేసుకోవాలని కోరారు. గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట పీహెచ్‌సీకి 'గ్రహణం'..!

- రాజాపేటలో 24 గంటల వైద్య సేవలందించాలి
- 30 వేల మంది ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా..?
- రాత్రివేళ అత్యవసర వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు
- పీహెచ్‌సీని పూర్తిస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్
- స్పందించకపోతే భారీ ఉద్యమం చేస్తామని హెచ్చరిక




**తొలివెలుగు, రాజాపేట :** మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)పై అధికారుల నిర్లక్ష్యం 'గ్రహణం'లా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 30 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన రాజాపేట పీహెచ్‌సీలో తగినంత మంది వైద్యులు, మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాపేట మండలంలో సుమారు 30 వేల మంది జనాభా ఉండగా, పొరుగు ప్రాంతాల నుంచి మరో 5 వేల మంది వరకు వైద్యం కోసం రాజాపేట పీహెచ్‌సీపై ఆధారపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

### 25 ఏళ్లయినా మారని పరిస్థితి:

సుమారు 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు పడకల సంఖ్య పెంచలేదని ప్రజలు పేర్కొన్నారు. మండల కేంద్రం కావడంతో ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తారని ఆశించినా ఆ దిశగా చర్యలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### స్పెషలిస్ట్ వైద్యులు ఎక్కడ..?

ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలకు అవసరమైన వైద్యులు, స్పెషలిస్టులు అందుబాటులో లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు వంటి స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందకపోవడంతో మండల ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రివేళ అత్యవసరమైతే..?

ముఖ్యంగా రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు అంటున్నారు. ప్రమాదాలు, ప్రసవాలు, ఇతర అత్యవసర సమయాల్లో తక్షణ వైద్యం అందుబాటులో లేక రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు



జాల గ్రామానికి చెందిన పారుపల్లి సంజీవరెడ్డి

గురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

### 40 కిలోమీటర్ల ప్రయాణం తప్పదా..?

రాజాపేటలో అత్యవసర వైద్యం అందుబాటులో లేకపోతే రోగులను సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని భువనగిరికి తరలించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. అత్యవసర సమయంలో ఇంత దూరం ప్రయాణించడం వల్ల సకాలంలో చికిత్స అందక ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### పీహెచ్‌సీని పూర్తిస్థాయి ఆసుపత్రిగా మార్చాలి:

రాజాపేట పీహెచ్‌సీని పూర్తిస్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన స్పెషలిస్ట్ వైద్యులను నియమించడంతో పాటు పడకల సంఖ్య పెంచి, మౌలిక వసతులు, వైద్య పరికరాలు కల్పించాలని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

### 'ప్రజలకు సరైన వైద్యం అందాలి'

జాల గ్రామానికి చెందిన పారుపల్లి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రాజాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా రాజాపేట ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే అభివృద్ధి చేసి, 24 గంటల వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. డిమాండ్లను పట్టించుకోకపోతే మండల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



# ఆర్థిక సహాయం అందజేత

- బంటుగూడెంలో మృతిచెందిన వడ్డెర ఎల్లయ్య కుటుంబానికి రూ.5 వేలు అందజేత

**తొలివెలుగు, రాజాపేట :** మండల కేంద్రమైన రాజాపేట మధిర గ్రామంలోని బంటుగూడెం కాలనీకి చెందిన వడ్డెర ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి రాజాపేట ఉపసర్పంచ్, స్వాతి చికెన్ సెంటర్ నిర్వాహకుడు నమిల కేదారి బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరుపేద కుటుంబానికి కొంతమేర ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్‌గౌడ్, నాయకులు ఐరేని నవీన్‌కుమార్, రేగు సిద్ధులు, డాక్టర్ చింతల రవీందర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు గొల్లెన స్వామి, అవినాష్, శ్రావణ్, నర్సింలు, ప్రవీణ్, భాను, చింటూ, రవి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- శ్రీని ఫార్మాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు
- ఎస్పీ ఆదేశాలతో ఉద్యోగులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేష్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం సమీపంలోని శ్రీని ఫార్మా సంస్థలో బుధవారం ఉద్యోగులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నందగిరి వెంకటేష్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, వాటి తీవ్రతను ఉద్యోగులకు వివరించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ వినియోగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీని ఫార్మా ప్రతినిధులు, ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# ఉద్యోగ జేఏసీ మహా ధర్నాను విజయవంతం చేయాలి

- 27న జిల్లా కేంద్రంలో మహా ధర్నా
- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వర్కర్లు అధిక సంఖ్యలో తరలిరావాలి
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు పిలుపు

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ రాములు పిలుపునిచ్చారు. బుధవారం చౌటుప్పల్ డివిజన్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాములు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులను అన్ని రిఫరల్ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, జీవో నంబర్ 25ను సవరించాలని కోరారు. ప్రతి నెల రూ.2 వేల కోట్ల నిధులు మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహా ధర్నాకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వర్కర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బోయ రాములు కోరారు.





## స్థానిక ఎన్నికల్లో కూటమి శ్రేణులు సమన్వయంతో పని చేయాలి: పురందేశ్వరి

**కూటమి ఎన్నికల్లో కూటమి ఐక్యంగా బరిలోకి దిగుతుందన్న పురందేశ్వరి**

**2024 ఫలితాలను స్థానిక ఎన్నికల్లో కూడా పునరావృతం చేయాలని పిలుపు**

**కేంద్రం సహకారంతో అమరావతి, పోలవరం పనులు వేగవంతమయ్యాయని వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి (టీడీపీ-బీజేపీ-జనసేన) ఐక్యంగానే బరిలోకి దిగుతుందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి స్పష్టం చేశారు. రాజమండ్రిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయం మాదిరిగానే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024లో ప్రజలు అందించిన బలమైన మద్దతును స్థానిక సంస్థల్లోనూ పునరావృతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ క్రమంగా బలోపేతమవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని... స్థానిక సమరంలో కూటమి జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

## ఏఈ కుటుంబం ఆత్మహత్య కేసులో బిగ్ ట్విస్ట్.. సాదిక్ తల్లి సంచలన వ్యాఖ్యలు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ తల్లి నూర్జహాన్ బుధవారం తొలిసారిగా మీడియా ముందుకు వచ్చి కీలక విషయాలు వెల్లడించారు. తన కుమారుడి వేధింపుల వల్లే నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుందన్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. అసలు కథ వేరే ఉందని, సౌజన్యనే తన కుమారుడిని వివాహం చేసుకోవాలని కోరిందని ఆమె తెలిపారు. కాకినాడ జిల్లాలో మీడియాతో మాట్లాడిన నూర్జహాన్, ఈ కేసుకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు చెప్పారు. "సౌజన్య రెండుసార్లు మా ఇంటికి వచ్చింది. సాదిక్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పింది. కానీ మేము ఆ ప్రతిపాదనను నిరాకరించాం. ఒకవేళ జగదీశ్వర్ రెడ్డితో వివాహం జరగకపోయి ఉంటే, సౌజన్యను సాదిక్‌కే ఇచ్చి పెళ్లి చేసేవాడ్నని నూకరాజే స్వయంగా మాతో అన్నారు" అని నూర్జహాన్ వివరించారు. సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మృతితో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. పైగా, ఈ ఏడాది ఫిబ్రవరి 14న సౌజన్య ఫోన్ చేసి పిలవగా వెళ్లిన సాదిక్‌పై జగదీశ్వర్ రెడ్డి, అతని మనుషులు దాడి చేసి, కత్తితో బెదిరించారని ఆరోపించారు. భర్త సరిగా చూసుకోకపోవడం వల్లే సౌజన్య తన కుమారుడితో సంబంధం కొనసాగించిందని నూర్జహాన్ అన్నారు. సౌజన్య కుమారుడు రియాన్ష్. సాదిక్‌ను 'అబ్బు' అని, సొంత తండ్రిని 'ఇడియట్' అని పిలిచేవాడని ఆమె చెప్పడం గమనార్హం. ఫోన్‌లో సాదిక్ చెప్పే కథలు వింటూ ఆ బాలుడు నిద్రపోయేవాడని తెలిపారు. సౌజన్య తమను తెలుగు ఖురాన్, బురఖా కావాలని అడిగినట్లు కూడా ఆమె వెల్లడించారు.

ఆత్మహత్య చేసుకున్న రోజు సాయంత్రం 5:30 గంటలకు సౌజన్య ఫోన్ చేసి రమ్మని పిలిచిందని, అయితే కేరళలో విద్యార్థుల కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండటంతో సాదిక్ తన అకాడమీకి వెళ్లాడని నూర్జహాన్ తెలిపారు. నూకరాజు కుటుంబానికి చెందిన ఆస్తులు గానీ, బంగారం గానీ తమ వద్ద లేవని, తమ బ్యాంకు పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులను పోలీసులకు అప్పగించామని ఆమె స్పష్టం చేశారు. కాగా, ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య ఇటీవల రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బాలుడు రియాన్ష్ ఒక్కడే ఈ ఘటన నుంచి బయటపడ్డాడు. గోదావరిలో మునిగిపోతున్న అతడిని మత్స్యకారులు కాపాడారు. సాదిక్ వేధింపులు, బ్లాక్‌మెయిల్ కారణంగానే తాము చనిపోతున్నట్లు వారు రాసిన లేఖలు కలకలం రేపాయి. ఈ కేసులో పోలీసులు సాదిక్‌ను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. తాజాగా ఆయన తల్లి చేసిన వ్యాఖ్యలతో ఈ కేసుకు సరికొత్త కోణం తోడైంది.



## గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారు

**బంగాళాఖాతంలో గల్లంతైన ఏపీ మత్స్యకారుల ఆచూకీ లభ్యం**

**పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్న ఏడుగురు జాలర్లు**

**బోటులో సాంకేతిక లోపంతో తీరానికి కొట్టుకుపోయిన వైనం**

**వారిని స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు**



బంగాళాఖాతంలో ఈ నెల ప్రారంభంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. వారంతా సురక్షితంగా ఉన్నారని, దీంతో వారి కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఓడలరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఆగస్టు 3న సముద్రంలోకి వేటకు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వారు ఆగస్టు 12 నాటికి తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి. మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం, మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక లోపం తలెత్తడంతో అది పశ్చిమ బెంగాల్ తీరానికి కొట్టుకుపోయింది. అక్కడి అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏపీ అధికారులు, బోటు యజమాని సోదరుడైన భవానీ ప్రసాద్‌తో మాట్లాడి మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, అధికారుల బృందాన్ని వెంటనే పశ్చిమ బెంగాల్‌కు పంపాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ (×జ+), నౌకాదళం, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు జరిపారు. మంగళవారం నాడు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసి, 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్, నార్త్-ఈస్టర్న్ కమాండ్‌లను అప్రమత్తం చేయడంతో పాటు, మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (వీ=జజ) పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్ నిఘా కూడా కొనసాగించారు. అవసరమైతే సమాచారం లభించవచ్చనే ఉద్దేశంతో పొరుగు దేశాలైన మయన్మార్, బంగ్లాదేశ్ సముద్రయాన అధికారులను కూడా అప్రమత్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితోనే మత్స్యకారుల ఆచూకీని కనిపెట్టగలిగామని, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కోస్ట్ గార్డ్ సిబ్బందిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

## హైదరాబాద్ నుంచి నేపాల్ వెళ్లిన వారు సురక్షితం

- **నేపాల్‌లో మెరుపు వరదలతో 95 మంది మృతి, 500 మంది గల్లంతు**
- **హైదరాబాద్ నుంచి కైలాస యాత్రకు వెళ్లిన 156 మంది సురక్షితం**
- **తమకు సాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
- **బాధితులను రప్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి**



హిమాలయ దేశం నేపాల్‌ను మెరుపు వరదలు ముంచెత్తాయి. ఈ ఆకస్మిక ప్రకృతి బీభత్సంలో ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 500 మంది వరకు గల్లంతయ్యారు. ఇదే సమయంలో కైలాస మానసరోవర యాత్ర కోసం తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన యాత్రికుల భద్రతపై ఆందోళన నెలకొనగా, వారంతా క్షేమంగా ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, కైలాస మానసరోవర యాత్రకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 156 మంది యాత్రికుల బృందం సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందింది. వరదల ప్రభావం లేని ప్రాంతంలో వారు క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వీరంతా చైనా సరిహద్దుకు సమీపంలో సురక్షితంగానే ఉన్నప్పటికీ, భారీ వర్షాలు, వరదల కారణంగా రోడ్డు మార్గాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో వారు ఉన్న ప్రాంతం నుంచి నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ చేరుకోవడం కష్టతరంగా మారింది. తమను సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు ప్రభుత్వం సహాయం చేయాలని వారు కోరుతున్నారు. వీరిలో, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన యాత్రికులు కూడా ఉన్నారు. తాము ప్రస్తుతం చైనా భూభాగంలోని డార్చ్ ప్రాంతంలో ఓ హోటల్ లో ఉన్నామని, భూమికి 15 వేల అడుగుల ఎత్తులో ఉండడం వల్ల తమకేమీ వరద ముప్పులేదని తెలిపారు. అయితే, తాము సెప్టెంబరు 1న భారత్ తిరిగి రావాల్సి ఉందని, తమ వీసాలు ట్రావెల్ ఏజెన్సీ వద్ద ఉండడంతో ఎలా రావాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వెంటనే స్పందించారు. ఆయన నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులతో ఫోన్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వంతో సమన్వయం చేసి తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ.. ఒక డాలర్‌కు 20 లక్షల రియాల్స్!



ఇరాన్ కరెన్సీ రియాల్ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫ్రీ మార్కెట్‌లో ఒక అమెరికా డాలర్ విలువ ఏకంగా 2 మిలియన్ల (20 లక్షల) ఇరానియన్ రియాల్స్‌కు చేరింది. అమెరికా విధించిన కఠిన ఆంక్షలు, ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ పరిణామాలతో సుమారు 9.2 కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. అల్ జజీరా ప్రచురించిన ఒక కథనం ప్రకారం, దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ ఆంక్షలు, ముఖ్యంగా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలు ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచాయి. దీనికి తోడు, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆ కథనం పేర్కొంది. కరెన్సీ విలువ పడిపోవడంతో దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ఈ కరెన్సీ పతనం సామాన్యుడి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధానికి ముందు 2 మిలియన్ల రియాల్స్‌కు దాదాపు 4 కిలోల టమాటాలు, అర కిలో చికెన్, లీటర్ వంట నూనె వచ్చేవి. కానీ ఇప్పుడు అవే డబ్బులకు వాటిలో సగం కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. టమాటాల ధర 71 శాతం, చికెన్ ధర 74 శాతం, వంట నూనె ధర 177 శాతం పెరిగాయి. నిత్యావసరాలకే ఈ పరిస్థితి ఉంటే, మందుల ధరల పెరుగుదల మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు, ఇన్సులిన్ ధర 642 శాతం పెరిగింది. ధరల పెరుగుదలతో ప్రజలు మాంసం, చికెన్, కొత్త బట్టలు వంటివి కొనడం పూర్తిగా తగ్గించుకున్నారు. ప్రభుత్వ కనీస వేతనం నెలకు సుమారు 166 మిలియన్ రియాల్స్ (దాదాపు 82 డాలర్లు) ఉండగా, ఖర్చులు మాత్రం ఆకాశాన్నంటాయి. టెహరాన్‌లోని ఒక రిటైల్ వ్యాపారి తన అమ్మకాలు 40 శాతం పడిపోయాయని, చాలా వ్యాపారాలు మూతపడే ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక ఆంక్షలు, యుద్ధం వల్ల దెబ్బతిన్న ఉత్పత్తి, అమెరికా నౌకాదళ దిగ్బంధనం, అంతర్జాతీయ మార్కెట్లకు దూరం కావడం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు. నెల జీతంతో నెల రోజుల అవసరాలు ఎంతవరకు తీరుతాయన్నదే ఇప్పుడు ఇరాన్ ప్రజల ముందున్న అతిపెద్ద ప్రశ్నగా మారింది. కాగా, ఇరాన్‌లో పెద్ద సంఖ్యలను సులభంగా చెప్పేందుకు 10 రియాల్స్‌ను ఒక "టోమన్"గా వ్యవహరిస్తుంటారు.

## వైసీపీలో బీసీ నేతలు బానిసల్లా బతికారు: చింతకాయల విజయ్

బీసీల జీవితాలతో జగన్ చెలగాటం ఆడారని, వారిని రాజకీయంగా వాడుకుని మోసం చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి తుడిచిపెట్టడం ఖాయమని టీడీపీ రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాజకీయంగా చరమగీతం పాడేందుకు రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రజలందరూ ఏకమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతోనే బీసీ అంటే 'వెనుకబడిన వర్గం' కాదని, సమాజానికి 'వెన్నుముక వర్గం' (బ్యాక్‌బోన్ క్లాస్) అనే గుర్తింపు వచ్చిందని విజయ్ తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీలను 'బెస్ట్ క్లాస్'గా తీర్చిదిద్దుతోందని ఆయన కొనియాడారు. గత వైసీపీ పాలనలో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల సుమారు 16 వేల మంది బీసీలు తమ రాజకీయ అవకాశాలను కోల్పోయారని విజయ్ ఆరోపించారు. ఆ ఐదేళ్ల కాలంలో బీసీలపై దాడులు చేయడమే కాకుండా, టీడీపీకి చెందిన బీసీ నేతలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని విమర్శించారు. వైసీపీలో ఉన్న బీసీ నాయకులు ఆత్మగౌరవం లేకుండా బానిసల్లా బతికారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీకి, బీసీలకు విడదీయరాని అనుబంధం ఉందని, పేదలు, బలహీన వర్గాలు టీడీపీని తమ సొంత పార్టీగా గర్వంగా భావిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

## అర్హులందరూ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- ఈ నెల 31తో ముగియనున్న తుది గడువు
- కవ్వాల్ ఉపసర్పంచ్ నల్లతీగల విష్ణు



**తొలివెలుగు, జన్నారం:** ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ ఉపసర్పంచ్ నల్లతీగల విష్ణు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 31వ తేదీ తుది గడువు అని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గ్రామ ప్రజలు తమ పరిసరాల్లోని అర్హులకు సమాచారం అందించి, వారు గడువులోగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని విష్ణు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- మద్దెలమ్మ దేవాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ
- వైభవంగా పదో వార్షిక బోనాల మహోత్సవం
- వరసిద్ధి వినాయక, నందీశ్వర సహిత శివలింగ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రతిష్ఠ



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మణికంఠనగర్‌లో శ్రీశ్రీశ్రీ మద్దెలమ్మ అమ్మవారి దేవాలయంలో పదో వార్షిక బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకుని నూతన విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు గోశిక స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయక, నందీశ్వర సహిత శివలింగం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ఆశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 27న శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం నుంచి మహిళా భక్తులు బోనాలతో బయలుదేరి బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి మద్దెలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు గుర్రం నరసింహ, కార్యదర్శి గోశిక అంజయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బడుగు మోహన్‌బాబు, మార్కండేయ స్వామి దేవాలయ అధ్యక్షుడు బడుగు ప్రకాష్, ఉపాధ్యక్షుడు వనం రాజు, చిక్క నరహరి, సహాయ కార్యదర్శి కందగట్ల ఆనంద్, సుంకి రవికుమార్, గోశిక కరుణాకర్, పిల్లలమర్రి యాదగిరి, గోశిక భాస్కర్, కర్నాటి శ్రీనివాసులు, కడవేరు శంకరయ్య, రుద్ర యాదగిరి, కోడి వనిత, వనం జయశ్రీ, గడ్డం పద్మశ్రీ, గోశిక సత్యనారాయణ, గోశిక రవి, గోశిక వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులపై ఉక్కుపాదం

జూబ్లీహిల్స్,ఆగస్టు26: నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రహ్మత్‌నగర్, వెంకటగిరి, బోరబండ ప్రాంతాల్లో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. రహ్మత్‌నగర్ శ్రీ ఆక్వా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడిచేసి తన భార్య నాగజ్యోతి (డీ ఫార్మసీ) పేరుమీద ఆక్వా ఫార్మసీ నడుపుతున్న రామశేఖర్ రెడ్డితో పాటు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ పూర్తిచేసి అక్కడే అనధికారికంగా వైద్యం అందిస్తున్న రాగం సుధాకర్ వద్ద ఇంజెక్షన్లు, బటర్‌ఫ్లై నీడిల్స్, గడువు ముగిసిన టామడాల్ ఇంజెక్షన్లు, 30 పెద్ద సైలైన్ బాటిల్స్, రూ.10 వేల విలువైన సర్జికల్ కత్తెరలు స్వాధీనం చేసుకున్నారు. రహ్మత్‌నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా క్లినిక్ నడుపుతూ రోగుల నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు వసూలు చేస్తున్న మిరుదొడ్డి భారతిని కూడా అదుపులోకి తీసుకుని పారాసిటమాల్ పీడీయాట్రిక్ సిరప్లు, యాంటీ బయోటిక్స్, ప్రెగ్నెన్సీ కిట్లు, బీపీ మిషన్, స్టెతస్కోప్, సైలైన్ ఇంఫ్యూజన్ సెట్లు, రూ.20 వేల విలువైన డిస్పో వ్యాన్ సిరంజిలు స్వాధీనం చేసుకున్నారు. వెంకటగిరిలో పేరులేకుండా క్లినిక్ నడుపుతున్న కాటిక మహేశ్ రావును, బోరబండ గంగానగర్‌లో క్లినిక్ ఏర్పాటు చేసిన మహమ్మద్ అబ్దుల్ అలీ లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


## సర్ నోటీసుల జారీలో జాప్యం

జీహెచ్ఎంసీ పరిధిలో ఓటరు జాబితా సవరణ, బోగస్, డబుల్ ఓట్ల తొలగింపు ప్రక్రియలోనూ అధికారులు అదే అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అనామలిస్, నాన్ మ్యాపింగ్, రిపీటెడ్ ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) నేరుగా ఇళ్లకు వెళ్లి నోటీసులు జారీ చేయాల్సిన ప్రక్రియ నత్తనడకగా సాగుతున్నది. వాస్తవానికి ఈ నెల 28 (రేపటి)లోగా అందరికీ నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, ప్రతి నియోజకవర్గంలో పట్టుమని పది శాతం కూడా నోటీసుల పంపిణీ జరగకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. ఈ క్రమంలోనే ముషీరాబాద్ నియోజకవర్గంలో 92,300, మలక్‌పేటలో 74,536, అంబర్‌పేటలో 79,831, ఖైరతాబాద్‌లో 74,977, జూబ్లీహిల్స్‌లో 1,14,338, సనత్‌నగర్‌లో 74,449, నాంపల్లిలో 68,708, కార్వాన్‌లో 96,389, గోషామహల్‌లో 69,756, చార్మినార్ 47,934, చాంద్రాయణగుట్టలో 73,889, యాకత్‌పురలో 87,568, బహదూర్‌పురలో 83,401, సికింద్రాబాద్‌లో 84,303, కంటోన్మెంట్‌లో 93,628 ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలోని ఇప్పటివరకు డిజిటైజ్ అయిన ఓటర్లలో 24 శాతం మంది ఓటర్లు నాన్ మ్యాపింగ్ ఓటర్లతో కలిపి అనామలిస్ క్యాటగిరీ కింద ఉన్న 6 లక్షల 72 వేల 678 మందితో కలిపి మొత్తం 12 లక్షల 52 వేల పైచిలుకు ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసుల జారీలో భాగంగా ఓటరు అందుబాటులో లేకపోతే కుటుంబ సభ్యుల సంతకంతో నోటీసులు అందజేయాలి. కానీ ఇక్కడ బీఎల్ఓలు కనీసం నోటీసులు ఇస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. అంతేకాకుండా ఈ నోటీసులో హియరింగ్ తేదీ, వేదికను స్పష్టంగా సూచించాలి.

# జన్నారం మండలంలో ల్యాబ్‌ల దందా..!

- అర్హత లేని సిబ్బందితో వైద్య పరీక్షలు చేస్తున్నారంటూ ఆరోపణలు
- తక్కువ వేతనాలకు సిబ్బందిని నియమించుకుంటున్నారన్న విమర్శలు
- పరీక్షల రిపోర్టుల ఖచ్చితత్వంపై రోగుల్లో ఆందోళన
- ప్రైవేట్ ల్యాబ్‌లపై తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

**తొలివెలుగు, జన్నారం:** జన్నారం మండలంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ ల్యాబొరేటరీల నిర్వహణపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత విద్యార్హతలు, అనుమతులు లేని సిబ్బందితో రక్తం, మూత్రం తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. తక్కువ వేతనాలకు సిబ్బందిని నియమించుకుని పరీక్షలు చేయిస్తున్నారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.




### అర్హతలపై ఆరా తీయరా..?

వైద్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్లకు సంబంధిత గుర్తింపు పొందిన విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ ఉండాల్సి ఉంది. అయితే మండలంలోని కొన్ని ల్యాబ్‌లలో అర్హతలు స్పష్టంగా లేని సిబ్బందితోనే పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేదా శిక్షణపై స్పష్టత లేని వ్యక్తులతో పరీక్షలు చేయించడం వల్ల రోగుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రిపోర్టుల్లో తేడాలంటూ ఫిర్యాదులు:

ల్యాబ్ పరీక్షల ఫలితాలు వైద్యుల చికిత్సకు కీలకంగా మారుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో అర్హత లేని సిబ్బందితో పరీక్షలు నిర్వహిస్తే రిపోర్టుల ఖచ్చితత్వంపై అనుమానాలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో పరీక్షల రిపోర్టుల్లో తేడాలు వస్తున్నాయని రోగులు వాపోతున్నట్లు సమాచారం.

### అధికారుల తనిఖీలు ఎక్కడ..?

ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ల్యాబొరేటరీల నిర్వహణపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని ప్రైవేట్ ల్యాబ్‌లను తనిఖీ చేసి సిబ్బంది విద్యార్హతలు, రిజిస్ట్రేషన్, ల్యాబ్ అనుమతులు, సిబ్బంది వివరాలు తదితర అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు అందేలా అధికారులు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




- అందిన కాడికి దండుకో.. దొరికిన కాడికి దోచుకో అన్నట్లుగా వ్యవహారమంటూ విమర్శలు
- కబ్జాలు, అక్రమాలపై ప్రజల్లో గుసగుసలు
- పనుల కోసం వచ్చే వారి నుంచి వసూళ్ల ఆరోపణలు
- ఫామ్‌హౌస్ వేదికగా విందులు, సెటిల్‌మెంట్ల కలకలం
- ఎస్సీ కార్పొరేషన్ రుణాల విషయంలోనూ ఆరోపణలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలో కొందరు 'షాడో ఎమ్మెల్యేలు'గా చెలామణి అవుతున్నారనే ప్రచారంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అధికారిక పదవులు లేకపోయినా అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, తమ పలుకుబడిని ఉపయోగించి పనులు చేయిస్తామంటూ కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న పని నుంచి పెద్ద వ్యవహారం వరకు తమ ద్వారానే వెళ్లాలన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.

### అందిన కాడికి దండుకో..?

చిన్న పని నుంచి పెద్ద పని వరకు తమ ద్వారా వెళ్లాల్సిందేనన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. భూ వ్యవహారాలు, వివిధ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ఇతర సమస్యల పరిష్కారం పేరుతో ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు పోటీ పడి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రజల అవసరాలు, సమస్యలను తమకు అనుకూలంగా మలుచుకుని డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కబ్జాలు.. అక్రమాల పర్వమా..?

చౌటుప్పల్ పరిధిలోని భూ వ్యవహారాలు, కబ్జాలు, వివాదాస్పద స్థలాల సెటిల్‌మెంట్లలో కూడా కొందరు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారికంగా ఎలాంటి బాధ్యతలు లేకపోయినా, రాజకీయ పలుకుబడి పేరుతో వివిధ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. భూ వివాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తూ తమకు అనుకూలంగా వ్యవహారాలను మలుపు తిప్పుతున్నారనే ప్రచారం కూడా స్థానికంగా జరుగుతోంది.

### ఫామ్‌హౌస్ వేదికగా సెటిల్‌మెంట్లు..?


చౌటుప్పల్ పరిసర ప్రాంతంలోని ఓ ఫామ్‌హౌస్‌లో తరచూ సమావేశాలు, విందులు నిర్వహిస్తూ వివిధ వ్యవహారాలపై చర్చలు, సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. మందు, విందు కార్యక్రమాల మధ్య పలు వ్యవహారాలకు పరిష్కారం పేరుతో బేరసారాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహస్య సమావేశాల పేరుతో జరిగే ఈ కార్యక్రమాలపై స్థానికుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 'కారు ఈఎంఐ కట్టు.. పని అయిపోతుంది..?'

వివిధ పనుల కోసం ఆశ్రయించే కొందరితో డబ్బుల విషయమై బేరసారాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. "కారు ఈఎంఐ ఉంది.. అది కడితే నీ పని అయిపోయినట్లే" అన్న తరహాలో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ స్థానికంగా చర్చ సాగుతోంది. ప్రజల అవసరాలను, అధికారులతో ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకుని కొందరు తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పని చేయించుకోవాలంటే ముందుగా 'చేయి తడపాల్సిందే' అన్న భావన కలిగించేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఎస్సీ కార్పొరేషన్ రుణాలకూ 'చేయి తడపాల్సిందేనా..?'

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు కూడా కొందరు మధ్యవర్తుల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణం మంజూరు చేయిస్తామంటూ లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ప్రచారం ఆందోళన కలిగిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు ఉద్దేశించిన ప్రభుత్వ పథకాల విషయంలోనూ మధ్యవర్తుల ప్రమేయం పెరగడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజమైన అర్హులకు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. చౌటుప్పల్‌లో 'షాడో ఎమ్మెల్యేల' దందాగా ప్రచారం జరుగుతున్న ఈ వ్యవహారాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.




# వీసా ఇంటర్వ్యూలు ఆపేసిన అమెరికా



న్యూయార్క్ : డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లలో వీసా అపాయింట్‌మెంట్లు, ఇంటర్వ్యూలను నిలిపివేసింది. వలసలపై కఠిన నియమాలు అమలు చేయడంలో భాగంగానే అపాయింట్‌మెంట్లను నిలిపివేసినట్టు యూఎస్ విదేశాంగశాఖ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా రాయబార కార్యాలయాల్లోని వీసా అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, అందుకే వీసా ఇంటర్వ్యూలను నిలిపివేసినట్టు యూఎస్ విదేశాంగశాఖ ప్రకటించింది. అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు వీసా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు అమెరికా తెలిపింది. ఇప్పటికే వీసాల కోసం ఐప్లై చేసుకున్న వారికి ఇంటర్వ్యూ రీ షెడ్యూల్ చేసినట్టు మెయిల్స్ ద్వారా సమాచారం వెళ్లింది. తాత్కాలిక వీసాలపై వచ్చి శాశ్వతంగా అమెరికాలోనే ఉండిపోవాలి అనుకునేవారి వీసాలను గుర్తించి రద్దు చేసే ప్రక్రియను కూడా ట్రంప్ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో దాదాపు 2లక్షలకు పైగా వీసాలు రద్దయ్యే అవకాశం ఉన్నది. అమెరికా వీసా ఇంటర్వ్యూలను ఆపేయడంతో అత్యవసరంగా చదువులు, ఉద్యోగాల కోసం ఐప్లై చేసుకున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అమెరికా ఉద్యోగాలు విదేశాలకు తరలిపోతాయని ఇండియన్-అమెరికన్ అడ్వొకసీ గ్రూప్ హెచ్చరించింది. హెచ్-1బీ వీసాతో పాటో ఓపీటీ ప్రోగ్రామ్‌పై లక్ష డాలర్ల అధిక ఫీజులను విధించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదనపై ద ఫౌండేషన్ ఫర్ ఇండియన్ అండ్ ఇండియన్ డయాస్‌పోరా స్టడీస్ బుధవారం ఒక ప్రకటన రిలీజ్ చేసింది. ఈ అధిక ఫీజుల వల్ల విదేశీ ఉద్యోగులను నియమించుకునే కంపెనీలపై మిలియన్ల డాలర్ల అదనపు భారం పడుతున్నదని అప్పుడు అమెరికా వెలుపల కంపెనీలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఈ సంస్థ తెలిపింది. హెచ్-1బీ, ఓపీటీలపై 1,03,265 డాలర్ల ఫీజును విధిస్తే అమెరికాకు ఇతర దేశాల నిపుణులు తగ్గిపోతారని.. ఇప్పటికే యూఎస్ యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గినట్టు వివరించింది. ట్రంప్ ప్రభుత్వం వీసాల జారీలో అనేక కోతలు పెడుతూ ఫీజులు పెంచుతున్నది. సెప్టెంబర్ 9 నుంచి 50 లేదా అంతకంటే ఎక్కువ మంది హెచ్-1బీ లేదా ఎల్-1 వీసా ఉద్యోగులున్న అమెరికా కంపెనీలు.. హెచ్-1బీ పొడిగింపు కోసం 4వేల డాలర్లు, ఎల్-1 పొడిగింపు కోసం 4500 డాలర్లు చెల్లించాలని నిబంధన పెడుతున్నది. దీని వల్ల ఆయా ఉద్యోగుల ఖర్చులను కంపెనీలు భరించలేక తొలగించే ప్రమాదం కూడా ఉంది. ప్రస్తుతం అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులకు ఎఫ్-1 వీసా ఉంది. యూఎస్‌లో చదువుకున్నంత కాలం ఇది ఇప్పటిదాకా వర్తించేది. కానీ ఇప్పుడు నాలుడేండ్లకు దీన్ని పరిమితం చేశారు. అంతకంటే ఎక్కువ కాలం కోర్సుల్లో చదివే విద్యార్థులు మళ్లీ అదనపు ఫీజుతో వీసాను పొడిగించుకోవాలి. ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అందరికంటే భారతీయులే ఎక్కువ ప్రభావితం అవుతారని నివేదికలు చెబుతున్నాయి. ఎందుకంటే అమెరికాకు ఉద్యోగాలు, చదువుల కోసం వెళ్లే వారిలో భారతీయులదే అగ్రస్థానం. యూఎస్‌సీఐఎస్ లెక్కల ప్రకారం గతేడాది హెచ్-1బీ వీసా పొందిన వారిలో 75 శాతం భారతీయులే. ఇక విద్యార్థుల్లోనూ మన దేశం వారే ఎక్కువ ఇప్పుడు ఓపీటీతో పాటు హెచ్-1బీ వీసాల ఫీజులు పెంచితే భారతీయులకు యూఎస్‌లో ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి.

2022లో వీసాల జారీ 55 శాతం ఉంటే 2025-26లో కేవలం 22 శాతమే ఉంది. ఇప్పుడు లక్ష డాలర్ల అదనపు ఫీజును సెప్టెంబర్ నుంచి విధించే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో కంపెనీలు కొత్త ఉద్యోగులను తీసుకోడానికే సంకోచిస్తాయి. అలాగే ఓపీటీపై లక్ష డాలర్ల ఫీజు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.95లక్షలకు పైగా కట్టాలి. అంత మొత్తం చదువులకే కట్టాల్సి వస్తే ఇక హెచ్-1బీ వీసాకు మరో లక్ష డాలర్లను చెల్లించడానికి అమెరికా కంపెనీలు సిద్ధపడుతాయా అన్నది అనుమానమే. 2024 నుంచి వరుసగా మూడేండ్ల పాటుగా వీసాల జారీలో 10 శాతం తగ్గుతూ వస్తున్నది.

# హిమపాతమా లేక భూకంపమా?



న్యూఢిల్లీ, ఆగస్టు 26: చైనా సరిహద్దు సమీపంలోని రసువా జిల్లాలో బోటే కోషి నదిలో నీటి ప్రవాహం హఠాత్తుగా పెరిగి విరుచుకుపడటంతో బుధవారం నేపాల్‌లో భారీ వరదలు సంభవించి దాదాపు 100 మంది మరణించగా విదేశీయులతోసహా వందలాది మంది గల్లంతయ్యారు. విధ్వంసం సృష్టించిన ఈ ఆకస్మిక వరదలకు గల కారణంపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నది. ప్రాథమిక అంచనా ప్రకారం లెండే నదిని హిమపాతం అడ్డుకోవడం వల్ల నీరు నిలిచిపోయి దిగువన అకస్మాత్తుగా ఉప్పొంగి ప్రవహించి ఉండవచ్చని తెలుస్తున్నది. నేపాల్, చైనాలోని శాస్త్రవేత్తలతో జరిపిన చర్చల ఆధారంగా ఈ ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు ఖాట్మండు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, వాతావరణ పరిశోధకుడు రిజన్ భక్త కాయస్థ పేర్కొన్నట్టు ది ఖాట్మండు పోస్ట్ తెలిపింది. నేపాల్ వైపు నుంచి వచ్చిన హిమపాతం లెండే నదిలో పది దాని ప్రవాహాన్ని అడ్డుకున్నట్లు కినిస్తున్నదని ఆయన అన్నారు. దాదాపు అదే సమయంలో టిబెట్ వైపు కూడా భూకంపం సంభవించినట్టు తెలుస్తున్నది. గోసైన్‌కుండకు ఉత్తరాన సుమారు 47 కిలోమీటర్ల దూరంలోని టిబెట్ ప్రాంతంలో ఉదయం 8.37 గంటలకు 4.4 తీవ్రతతో కూడిన భూకంపం సంభవించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే నమోదు చేసింది. అయితే వరదలు రావడంలో భూకంపం ఏమైనా పాత్ర పోషించిందా అనే విషయంలో స్పష్టత లేదు. ఈ విపత్తుకు హిమనీనద సరస్సు విస్ఫోటనం దోహదపడిందా అనే విషయాన్ని కూడా శాస్త్రవేత్తలు దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో అనేక పెద్ద హిమనీనద సరస్సులు ఉన్నందున హిమనీనద సరస్సు విస్ఫోటనం చెందిందో లేదో నిర్ధారించడానికి కొన్ని రోజులు పట్టవచ్చని కాయస్థ తెలిపారు. 2025 జూలై 8న ఆ ప్రాంతంలో ఇలాంటిదే మరో విపత్తు సంభవించింది. హిమనీనద సరస్సు ఒక్కసారిగా తెగిపోవడం వల్ల లెండే నదిలో అకస్మాత్తుగా వరదలు వచ్చాయి. నేపాల్-చైనా సరిహద్దు సమీపంలో ఒక మిమనీనద సరస్సు తెగిపోయిందని ఆ సమయంలోని ఉపగ్రహ చిత్రాలు సూచించాయి.

**నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్**

నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆకస్మిక వరవల కారణంగా సంభవించిన ప్రాణనష్టం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. నేపాల్‌కు సాధ్యమైనంత మానవతా సహాయం అందచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని, సహాయక, పునరావాస చర్యల విషయంలో తమ బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మోదీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నేపాల్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా బీహార్‌లో వరద ముప్పు ఉన్న నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కోవడంలో పూర్తి సహాయం అందచేస్తామని బీహార్ ప్రభుత్వానికి ఆయన హామీ ఇచ్చారు.



## వరద నీటిలో గురుగ్రామ్

గురుగ్రామ్: బీజేపీ పాలిత హర్యానా ఆదాయంలో గురుగ్రామ్ వాటా సుమారు 65శాతం. అందుకే గురుగ్రామ్.. హర్యానాకు బంగారు బాతు అయ్యింది. రూ.1,400 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ ఇప్పుడు వర్షం కురిస్తే ఏమాత్రం ఉపయోగం లేనిదిగా మారింది. మొన్నటి సోమవారం నాడు గురుగ్రామ్‌లో కురిసిన భారీ వర్షానికి రోడ్లు నదులుగా మారగా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో రాజీవ్ చౌక్ వద్ద విద్యార్థులు నీటిలో ఈదుకుంటూ వెళుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భారతదేశ కార్పొరేట్ షోపీస్‌గా పేరొందిన మిలీనియం సిటీ వర్షం కురిస్తే 'స్వాంకీ స్లమ్'(విలాసవంతమైన మురికివాడ)గా మారిపోతున్నదని అంటుంటారు. రాజకీయ విశ్లేషకుడు సుశాంత్ సరీన్ నగర పరిస్థితి గురించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బంగారు గుడ్లను పెట్టే బాతు లాంటి గురుగ్రామ్‌ను చంపేస్తున్నదని ఆరోపించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను అడ్డుకోవడంలో, సరైన రోడ్లను నిర్మించడంలో నగర డ్రైనేజీ అవసరాలను అర్థం చేసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. గురుగ్రామ్ నివాసి హిందోల్ సేన్ గుప్తా మాట్లాడుతూ తాము ఇకపై గురుగ్రామ్‌లో ఉండాలనుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి అధిక పన్నులు, భారీ అద్దెలు చెల్లిస్తున్నప్పటికీ తాము ప్రతియేటా నరకాన్ని అనుభవిస్తున్నామన్నారు. వర్షాలు పడినప్పుడు ఇంటికి చేరుకునేందుకు ఐదు కిలోమీటర్ల దూరానికి మూడు గంటలకు పైగా సమయం పడుతున్నదన్నారు. పూడుకుపోయిన డ్రైనేజీలు, సరిపోని సామర్థ్యం, గురుగ్రామ్ విస్తరణకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడంలో విఫలం కావడం మొదలైనవన్నీ ప్రస్తుత దుస్థితికి కారణమని స్థానికుడు అభిషేక్ బోస్ అన్నారు. గురుగ్రామ్ మౌలిక సదుపాయాలు కుప్పకూలడానికి బీజేపీ నేతృత్వంలోని హర్యానా ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ఎంపీ రణదీప్ సింగ్ సుర్జేవాలా ఆరోపించారు. మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసినట్లుగా చెబుతున్న రూ.1,400 కోట్లతో నగరానికి ఏమి లభించిందని ఆయన ప్రశ్నించారు. కాగా గురుగ్రామ్‌లో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు, నీరు నిలవడం వల్ల సెక్టార్ 9లో సిమెంట్ బస్తాలతో కూడిన ఒక ట్రక్కు రోడ్డులోకి కుంగిపోయింది. ఇది ఇక్కడి ఇంజినీరింగ్ అద్భుతాలకు రోడ్ల దుస్థితికి అద్దం పడుతున్నది.

## తిరుపతిలో కూలిన నాలుగు అంతస్తుల భవనం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణం వాణినగర్‌లో నాలుగు అంతస్తుల భవనం కుప్ప కూలింది . ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కస్థలంలో నిర్మాణం కోసం గుంతలు తీయడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ టీం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. గాయపడ్డవారిని హుటాహుటినా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం

సరికాదని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పష్టం చేసింది. లడ్డూ ప్రసాదంలో దారం కనిపించిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ధారణ లేని వీడియోలను ప్రచారం చేయవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. టీటీడీ ప్రతిరోజూ శ్రీ వైష్ణవ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అత్యంత పవిత్రతతో, పరిశుభ్రతా ప్రమాణాలను పాటిస్తూ భారీ స్థాయిలో తయారు చేసి భక్తులకు అందిస్తోందని తెలిపింది. లడ్డూ తయారీకి వినియోగించే ముడి పదార్థాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ సార్టింగ్ మిషన్ ద్వారా అత్యంత ఖచ్చితత్వంతో తనిఖీ చేస్తున్నట్లు పేర్కొంది. ముడి పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలోనూ టీటీడీ కఠినమైన ప్రమాణాలను పాటిస్తోందని వెల్లడించింది. ఈ విధానంలో లడ్డూ తయారీలో వేరే పదార్థాలు కలిసేందుకు అవకాశమే ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులకు అందించే ప్రతి ప్రసాదం నాణ్యతగా ఉండేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపింది. కొందరు వ్యక్తులు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో స్వామివారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై భక్తుల్లో అపోహలు కలిగించేలా నిర్ధారణ లేని వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరికాదని టీటీడీ పేర్కొంది. శ్రీవారి ప్రసాదం విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేసింది. భక్తులు ఇలాంటి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయకుండా ఉండాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద విషయం కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరింది.శ్రీవారి ప్రసాదాల పవిత్రత, నాణ్యత, పరిశుభ్రతలను కాపాడటానికి టీటీడీ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేసింది.



## మోహన్‌భగవత్ కార్యక్రమానికి వ్యతిరేకం

**న్యూయార్క్ మేయర్ విమర్శలు**

న్యూయార్క్ : ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మంగళవారం అమెరికాకు వెళ్లారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సంవత్సర గ్లోబల్ అవుట్‌రీచ్ కార్యక్రమం ఈ నెల 29న ప్రముఖ మాడిసన్‌స్వేర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమంలో ఐదు వేల మంది పాల్గొంటారని తెలుస్తున్నది. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అనేక సంస్థలు వ్యతిరేకించగా.. ఇప్పుడు న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ కూడా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి తాను మద్దతు ఇవ్వబోనని, దాన్ని రద్దు చేసే అధికారం నగరానికి ఉందో లేదో తెలియదన్నారు. తన తల్లి ఇప్పటికీ భారత్‌లోనే ఉందని అన్నారు.





# సైబర్ బాధితుల్లో బాలీవుడ్ నటి..

సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు క్యాంపెయిన్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే పోలీసులు, అధికార యంత్రాంగం ఎంత అవగాహన కల్పించినా సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పడటం లేదు. సామాన్యులు, అధికారులు, సెలబ్రిటీలు సైబర్ బాధితుల జాబితాలో చేరిపోతూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి కీర్తి కుల్హారి సైబర్ మోసానికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు నటి కీర్తి కుల్హారి మొబైల్‌ఫోన్, క్రెడిట్ కార్డ్‌ను హ్యాక్ చేసి రూ. 2.4 లక్షలు దోచుకున్నారు. తన ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా కావడంతో అప్రమత్తమైన కీర్తి ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ స్కాం వెనుకున్న వ్యక్తులెవరో గుర్తించి డబ్బును రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ క్రిమినల్స్ ఇండియాలో ఎలా రెచ్చిపోతున్నారో..? తాజా ఘటన మరోసారి చెప్పకనే చెబుతోంది. పింక్, మిషన్ మంగళ్, యురి ది సర్జికల్ స్ట్రైక్స్, ఇందూ సర్కార్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది కీర్తి కుల్హారి.



# 'దేశముదురు' కథ పూరి మొదట నాకే చెప్పారు : నటుడు సుమంత్



'న్యూటన్స్ థర్డ్ లా' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో టాలీవుడ్ నటుడు సుమంత్ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చి బ్లాక్‌బస్టర్ అయిన 'దేశముదురు' కథను మొదట పూరి గారు తనకే చెప్పారని, కానీ కొన్ని కారణాల వల్ల తాను ఆ సినిమాకు నో చెప్పానని ఆయన వెల్లడించారు. అయితే, ఆ సినిమాను అల్లు అర్జున్ చేసిన విధానం చూశాక.. నిజాయితీగా చెప్పాలంటే ఆ పాత్రను బన్నీ తప్ప మరొకరు అంత బాగా చేయలేరని సుమంత్ ప్రశంసించారు. ప్రస్తుతం సుమంత్, జగపతి బాబు, అవసరాల శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' రాజేష్ కర్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రేపు (జూలై 31) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర ప్రమోషనల్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో రవి వర్మ, అభినయన తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాజేష్ కర్ణ రచన, దర్శకత్వం వహించగా.. హరీష్ కొహిర్కర్ నిర్మించారు. సింజిత్ ఎర్రమిల్లి సంగీతం అందించగా, వేద వ్యాస్ గొట్టిపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌గా వస్తున్న ఈ చిత్రం 'థ్రిల్లర్ ఆఫ్ ది ఇయర్'గా నిలుస్తుందనే అంచనాలతో జూలై 31న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది.

# రజనీకాంత్ బయోపిక్ రానుందా?




హీరో రజనీకాంత్ జీవితం వెండితెరపైకి వచ్చే అవకాశం ఉందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. కొంత కాలంగా రజనీకాంత్ తన ఆటోబయోగ్రఫీ రాస్తున్నారట. ఇందులో బస్ కండక్టర్ నుంచి వెండితెరపై సూపర్ స్టార్‌గా ఎదిగిన తన జీవిత విశేషాలు, తన జర్నీలోని ఒడిదొడుకులు, మధుర జ్ఞాపకాలు, భావోద్వేగభరిత పరిస్థితులను గురించి ప్రస్తావించనున్నారట రజనీకాంత్. అంతేకాదు...తన జీవితంలో ఎవరికీ తెలియని కొన్ని ఆసక్తికరమైన సంగతులను ఈ పుస్తకం ద్వారా తెలియజేయాలని రజనీకాంత్ భావిస్తున్నారట. ఈ పుస్తకం ఆధారంగా ఓ సినిమా తీయాలని, ఈ బయోపిక్‌ను తెరకెక్కించాల్సి వస్తే ఎవరు దర్శకత్వం వహించాలి? వెండితెరపై తన పాత్రలో ఎవరు నటించాలి? అన్న అంశాలపై కూడా రజనీకాంత్ తన సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారని కోలీవుడ్ భోగట్టా. మరి... రజనీకాంత్ బయోపిక్ వెండితెరపైకి వస్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ప్రస్తుతం దర్శకుడు అశ్వత్ మారిముత్తుతో 'ధర్మన్' సినిమా చేస్తున్నారు రజనీకాంత్. ఈ చిత్రం తర్వాత నెల్సన్ దర్శకత్వం వహించనున్న మల్టీస్టారర్ మూవీ షూట్‌లో పాల్గొంటారు. ఈ చిత్రంలో కమల్‌హాసన్ కూడా నటిస్తున్నారు. అలాగే నెల్సన్ డైరెక్షన్‌లో రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్ 2' చిత్రం అక్టోబరు 15న విడుదల కానున్న సంగతి తెలిసిందే.



# 4వ తరగతి వరకు బర్త్‌డే తెలియదు ..

## ధనుష్ మాటలపై నెటిజన్ల విమర్శలు!

**కో**లీవుడ్ స్టార్ హీరో, పాన్ ఇండియా నటుడు ధనుష్ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. ఇటీవల తన 43వ పుట్టినరోజు సందర్భంగా చెన్నైలో అభిమానులు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ధనుష్, తన చిన్ననాటి జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన నిజాయితీని మెచ్చుకుంటుండగా, మరికొందరు మాత్రం ఇదే తరహా భావోద్వేగ కథలను పదేపదే చెబుతున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడిన ధనుష్.. జూలై 28 అనేది తనకు ఇప్పుడు ప్రత్యేకమైన రోజు అయినప్పటికీ, చిన్నప్పుడు మాత్రం తన పుట్టినరోజు ఎప్పుడో కూడా తెలియదని చెప్పారు. నాలుగో తరగతి వరకు తన జన్మదినం గురించి తనకు అవగాహన లేదని, ఒకసారి స్కూల్‌లో ఇతర విద్యార్థులు రంగురంగుల దుస్తులు వేసుకుని చాక్లెట్లు పంచుతుండటం చూసి తానూ అలానే చేయాలనిపించిందని వివరించారు.అప్పుడు తన అక్కను అడగగా, ఆమె తల్లిదండ్రులను అడిగి జూలై 28 తన పుట్టినరోజు అని చెప్పిందని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఒక కలర్ డ్రెస్, కొన్ని చాక్లెట్లు కొనిపించమని ఇంట్లో ఒప్పించి స్కూల్‌కు తీసుకెళ్లి పంచానని ధనుష్ చెప్పుకొచ్చారు.



# 'రామాయణం' ట్రైలర్ విడుదల..

## హనుమంతుడు ఎక్కడంటూ నెటిజన్ల ప్రశ్న!

బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో భారీ చర్చ జరుగుతోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ లంకాధీశుడు రావణాసురుడిగా నటిస్తున్నారు. దాదాపు నాలుగు నిమిషాలకు పైగా ఉన్న ఈ ట్రైలర్ విజువల్స్, గ్రాఫిక్స్ పరంగా అద్భుతంగా ఉందంటూ ప్రశంసలు అందుకుంటున్నప్పటికీ, ఒక ప్రధానమైన విషయంపై నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు సన్నీ డియోల్ హనుమంతుని పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, విడుదలైన ట్రైలర్‌లో శ్రీరాముడి బాల్యం, సీతారాముల కల్యాణం, వనవాసం, రావణుడి ఆధిపత్యం వంటి అనేక సన్నివేశాలను చూపించినప్పటికీ, హనుమంతుడికి సంబంధించిన ఒక్క చిన్న గ్లింప్స్ కూడా ట్రైలర్‌లో కనిపించలేదు. దీంతో అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తూ ట్రైలర్‌లో హనుమంతుడు ఎక్కడ? అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మొదటి భాగంలో కథ ఎక్కువగా సీతారాముల వివాహం, వనవాసం, సీతాపహరణం చుట్టూ తిరుగుతుందని, అందుకే హనుమంతుడి పాత్రకు సంబంధించిన హైలైట్స్‌ను మేకర్స్ గోప్యంగా ఉంచారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అభిమానులు మాత్రం హనుమంతుడి పోస్టర్‌ను అయిన వదలండి అంటూ కామెంట్లు పెడుతున్నారు.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com